# అంచనా

**కన్నారావు** ఆ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్. వర్కులో ఎఫిషియంట్. అతడు డ్రాఫ్టు రాస్తే కళ్ళు మూసుకుని సంతకం చేస్తాడు సూపరింటిండెంట్.

అయినా కించిత్ గర్వం లేదతడికి. తన ఇరవై ఏళ్ళ సర్వీసులో ఏనాడూ బల్లకింద చేతులు పెట్టి ఎరుగడు. అమ్యామ్యాలకు ఆమడదూరంలో ఉంటాడు. ఎవరి పనైనా ఇట్టే చేసి పెడతాడు. అందుకే అతడంటే అందరికీ ఇష్టం. పాపం అతడు కుంటివాడు. కర్ర ఊతలేందే నడవలేడు. అయితే అవిటితనం అతడి ప్రగతికి ఏనాడూ అవరోధం కాలేదు. ఎనలేని ఆత్మవిశ్వాసం కలిగి ఉండటమే అందుకు కారణం.

పగలంతా విరామం లేకుండా ఆఫీసులో పనిచేస్తాడు. ఏ రాత్రికో ఇల్లుచేరతాడు. కొంపలో కాలు పెట్టినా ఆ ప్రాణికి విశ్రాంతిలేదు. ఓ ప్రక్క పట్టబద్రుడై వుండి ఎందుకూ పనికిరాకుండా పోయిన కొడుకు గురించి బెంగ అయితే, మరో వంక పెళ్లికెదిగి కూర్చున్న పార్వతి గురించి ఆలోచన. వీటికి తోడు కన్నవాళ్ళ బాధ్యత. తను తిన్నా మానినా నెలనెలా తండ్రికి తొమ్మిదివందలు పంపుతాడు. పోతే విద్యావంతుడై నిరుద్యోగిగా వున్న కొడుకు మీద కొండంత సానుభూతి వుంది. అయితే వాడి సోమరితనాన్ని మాత్రం భరించలేకపోతున్నాడు.

"ప్రొద్దస్తమాను అలా గాలికి తిరగకపోతే ఏదైనా ఉద్యోగానికి ప్రయత్నించ రాదూ?" అన్నాడొక రోజు ఉండబట్టలేక.

"ఉద్యోగాలు మనకు అందని ద్రాక్షపళ్ళు నాన్నా. వాటి కోసం ఎదురుచూడటం శుద్ధ దండగ" అన్నాడు వినయ్.

అతడి మాటలలో నిరాశా, నిస్పృహలు ద్యోతకమవుతున్నాయి.

"గాలిలో దీపం పెట్టి దేవుడా నీదే భారం అంటే ఎలారా? కష్టపడి పోటీ పరీక్షలలో కూర్చుంటే ఎందుకు సెలక్టుకావు?" ఎదురు ప్రశ్న వేసాడు కన్నారావు కొడుకు ధోరణికి కంగారుపడుతూ.

"చేతులు ముడుచుక్కూచుంటే కాళ్ళ దగ్గరకొస్తాయూ ఉద్యోగాలు? స్వయంకృషితో పైకొచ్చిన మీ నాన్నగారిని చూడు" అంది కామాక్షమ్మ.

"ఆ రోజులు వేరమ్మా. అయినా నాన్నగారికి ఉద్యోగం ఎలా వచ్చిందో నాకు తెలుసు. అనవసరంగా నన్ను రెచ్చగొట్టవద్దు". అంటూ చరచరా బయటకెళ్ళిపోయాడు వినయ్.

బిడ్డ మాటలకు దిమ్మ తిరిగినట్టవడంతో తలపట్టుకుని కూర్చున్నారు కన్నారావు దంపతులు.

ఇలా వుండగా ఉరుము మెరుపు లేకుండా వానొచ్చినట్టు చెప్పాపెట్టకుండా ఊడిపడ్డాడు కన్నారావు తండ్రి కనకారావు.

రాకరాక వచ్చిన కన్నతండ్రికి సకల మర్యాదలు చేసాడు కన్నారావు.

అతనికిష్టమైన పిండివంటలు వండి వడ్డించింది కామాక్షమ్మ.

"పెద్దవాడు ఏం చేస్తున్నాడు?" కజ్జికాయ కొరుకుతూ అడిగాడు కనకారావు.

మాటల్లో వచ్చాడు వినయ్.

"అదుగో వస్తున్నాడు. వాడినే అడుగు" అంటూ అక్కడ నుండి లేచి వెళ్లిపోయాడు కన్నారావు.

"ఎప్పుడొచ్చావు తాతయ్యా! నీ ఆరోగ్యం ఎలా ఉంది? నానమ్మని కూడా తీసుకురాలేకపోయావా?" కుశలప్రశ్నలు వేస్తూ దగ్గరకొచ్చాడు వినయ్.

"మా మాటకేంగానీ నువ్వేం చేస్తున్నావో చెప్పావు కాదు."

తాతయ్య ప్రశ్నకు కాస్సేపు నీళ్ళు నమిలాడు వినయ్. ఆ వెంటనే తేరుకుని "చదువు పూర్తి అయింది. ఇహ ఉద్యోగం అంటావా వాటి సంగతి నీకు తెలియందేముంది?" అన్నాడు.

మనవడి నిర్లిప్త ధోరణికి కలవరపడ్డాడు కనకారావు.

"సరేలే పద... అలా బయట అరుగుమీద కూర్చుని మాట్లాడుకుందాం" అంటూ కంచంలో చేతులు కడుక్కున్నాడు.

కూర్చునేందుకు అరుగుమీద చాప పరిచాడు వినయ్.

"మీ నాన్న పోలిక మీకెవరికీ రాలేదు?" చాప మీద చతికిలబడతూ అన్నాడు కనకారావు.

ఆ మాటలు వినపడనట్లు నటించాడు వినయ్.

"చిన్నప్పుడు మీ నాన్న పట్టుదల చూసి మేమంతా ఆశ్చర్యపోయేవాళ్ళం. ముఖ్యంగా ఉద్యోగం కోసం వాడెంత కష్టపడ్డాడో తెలుసా?"

"నాన్న గురించి నాకేం చెప్పకు. ఓ చెయ్యో, కాలో లేకపోతే వికలాంగుల కోటాలో నేనూ సునాయాసంగా ఉద్యోగం సంపాదించే వాడ్ని" అన్నాడు వినయ్.

మనవడి ధోరణికి దెబ్బతిన్నట్లు అయిపోయాడు కనకారావు. కొన్ని క్షణాల వరకూ అతడి నోటినుండి ఏ మాటా రాలేదు. తర్వాత నెమ్మదిగా తేరుకుని తన కొడుకు గురించి వివరంగా చెప్పడం మొదలుపెట్టాడు.

వినడం వినయ్ వంతయింది.

★ ★ ★

నేను బడికెళ్ళను. నన్నంతా సొట్టాడినని గేలి చేస్తున్నారు" అన్నాడు ఏడేళ్ళ కన్నారావు కన్నీరుపెడుతూ.

బిడ్డ మాటలకు కనకారావు కళ్ల వెంబడి నీళ్ళు చిప్పిల్లాయి. నిజమే తన కొడుకు అవిటివాడు. ఆ కారణంగా వాడు పడుతున్న మానసిక క్షోభను అర్థం చేసుకోగలడు. అలా అని కాలు తెచ్చి వాడి మనస్థాపాన్ని పోగొట్టడానికి తను దేవుడు కాదు.

"అలా అనకు బాబూ. నువ్వు బాగా చదివి క్లాసులో ఫస్టు తెచ్చుకుంటూ ఉండాలి. నీ తెలివితేటలు చూసి టీచర్లు నిన్నెంతగానో మెచ్చుకుంటారు. అప్పుడు నీ తోటివాళ్లెవ్వరూ నోరు మెదపలేరు" అంటూ లాలనగా తనయుణ్ణి అక్కున చేర్చుకున్నాడు కనకారావు.

తండ్రి మాటలతో ఆ పసివాడిలో పట్టుదల పెరిగింది. ఎవరేమన్నా పట్టించుకోకుండా చదువుమీదే మనసు లగ్నం చేసాడు. ఫలితంగా ప్రతి క్లాసులో ఫస్టు రాసాగాడు.

"మెరిట్ స్కాలర్‌షిప్‌కి ధరఖాస్తు చెయ్యనా నాన్నా?" అడిగాడు కన్నరావు కాలేజీలో చేరుతూనే.

"దాని కంటే హేండీకేప్డ్ సర్టిఫికెట్టు పెడితే బావుంటుంది. ఏటా వెయ్యి రూపాయలు ప్రభుత్వ సహాయం లభిస్తుంది" సలహా ఇచ్చాడు కనకారావు.

"నాకా డబ్బు వద్దు నాన్నా. నేనెవరి సానుభూతిని భరించలేను. నా కష్టానికి ప్రతిఫలంగా ఎంత లభిస్తే అంతే చాలు. మెరిట్ స్కాలర్‌షిప్పు మూడొందలైనా నాకవి మూడువేలతో సమానం."

ఆ మాటతో కనకారావు నోటికి తాళం పడింది.

రోజులు గడుస్తున్నాయి. కన్నారావు బి.ఎ. ఫస్టుక్లాసులో పాసయ్యాడు.

కనకారావు దంపతుల ఆనందానికి అవధులులేవు. కొడుకు కలెక్టరైపోయినట్లుగా సంబర పడిపోయారు.

"ఈ శుభవార్త మా ఫ్రెండ్స్ అందరికీ చెప్పొస్తా" అంటూ అక్కడి నుండి మాయమయ్యాడు కన్నారావు.

"నువ్వు అదృష్టవంతుడివిరా. నీకు డిగ్రీతోపాటు మరో క్వాలిఫికేషన్ కూడా ఉంది" అన్నారు మిత్ర బృందం.

వారి మాటలు అర్థం కాక అయోమయంగా చూసాడు కన్నారావు.

"అలా చూస్తావేంరా? నువ్వు సొట్టాడివి కదా. వికలాంగుల కోటాలో సులువుగా ఉద్యోగం కొట్టేస్తావు" అన్నారు నవ్వుతూ.

వారి మాటలకు కన్నారావులో పౌరుషం తలెత్తింది. "నాకా రిజర్వేషను అక్కర్లేదు. మీ అందరిలాగే నేనూ ప్రయత్నిస్తాను" అని చెప్పి అందుబాటులో వున్న అవకాశాన్ని కాలదన్నుకుని కష్టపడి చదివి పోటీపరీక్షలకు హాజరై ఓపన్ కాంపిటీషన్‌లో నెగ్గి అందర్నీ విస్మయపరిచాడు.

★ ★ ★

తండ్రిని గురించి తాతయ్య చెప్పిన ప్రతిమాట వినయ్ గుండెల్లో బలంగా గుచ్చుకుంది. అపారమైన తెలివితేటలతో పాటు ఉన్నతమైన వ్యక్తిత్వం, కొండంత ఆత్మ విశ్వాసం కలిగిన ఆ మహామనిషిని తనెంత తక్కువగా అంచనా వేసాడు?

ఆ భావనకు సిగ్గుతో కుంచించుకుపోయాడు. అంతే! ఆ క్షణం నుండి కన్నతండ్రిని ఆదర్శంగా తీసుకోవాలనుకున్నాడు. దాంతో ఆకాశమంత ఆవేశం వచ్చింది. ఆ రోజు లగాయితు చక్కర్లు కట్టిపట్టి చదవడం ప్రారంభించాడు. వదలకుండా ప్రతి టెస్టుకి హాజరవుతున్నాడు.

ఉన్నట్టుండి వీడింత బుద్ధిమంతుడెలా అయిపోయాడా? అనుకుని నివ్వెరపోయారు కన్నారావు దంపతులు.

**(డిసెంబరు 2000, ఆంధ్రభూమి మంత్లీ)**